# కుక్కగొడుగులు

**వాడపల్లి విజయలక్ష్మి**

ముత్యాలు బజారు మనిషి. దానికెప్పుడు తను వీధిన పడిందో గుర్తులేదు. బుద్ధి బాగా తెలిసినప్పటి నుండీ ఒంటిని ఎరువిచ్చి ఆ వచ్చిన డబ్బుతోటే బ్రతుకుతోంది.

ఆ వాడవాడంతా అదేమూక. రాత్రి పదిదాటిందంటే దారివెంబడి పోయే వాణ్ణి చేతులు పుచ్చుకొని లాగుతారు, "మావాఁ" అంటూ, ఇకిలించుకొని పోయేవాడి వెనుకబడతారు.

ముఖాలకు బూడిద పులుముకున్నట్టు వాళ్ళు ఏ చౌకరకం పౌడరో పులుముకొని, కొప్పునిండా పూలు తురుముకొని తయారౌతారు. గుంట్రని కళ్ళకు కాటుక ఎముకలు పైబడ్డ శరీరానికి ఓ పల్చని చీర సింగారించుకొని, లోతుకుపోయిన బుగ్గల్తో వెగటుగా ఉంటారంతా. నోట్లో ఊటలు ఊరే తమలపాకులు నముల్తూ, కూర్చున్నచోటే ఉమ్మేస్తూ పక్కన జేరిన జులాయి వెధవలందరితోటీ బూతులు మాటాడుతూ వెకిలిగా నవ్వుతూంటారు.

అందరిలోనూ బొమికలు కనబడని అందకత్తె ముత్యాలు. దాని చక్కదనం అందరికి కన్నెర్రగా ఉండేది. ముత్యాలంటే ఇష్టపడేవాళ్ళూ ఉన్నారు.

అదంతా పగలస్తమానం నిశ్శబ్దంగా ఉండే ప్రదేశం. అటు యిటూ తిరిగే కోట్లమాత్రం కాస్త సందడిగా ఉండేవి. రాత్రి పడిందో తేనెటీగల తుట్టెలా ఉంటుంది. పై ఊళ్ళనుంచి సినిమాలకు వచ్చిన వాళ్ళతోటి, ఆ ఊరి రౌడీలతోటి, అక్కడే అవకాశం కోసం వచ్చేదే పోలీసులతోటి, ఏదైనా బేరం దొరుకుతుందేమోనని ఆశతో వుండే రిక్షావాళ్ళతోటీ, చాలా హడావుడిగా వుంటుంది - రాత్రిపూట.

అప్పుడే ఈవలకు వస్తారు సుందరీమణులు. లోకుల చీకటి అవసరాలను తీర్చేకల్ప వృక్షాలు. అదంతా ఒక మాయ. సంఘం శరీరంలో కుళ్ళిపోయి దుర్గంధాన్ని వెదజల్లే గాయం. ఆ పెంటపై వ్రాల్తోంటాయి ఈగలు

కొన్ని - ప్రపంచాన్ని మలినం చెయ్యడమే వృత్తిగాగల జీవాలవి.

డబ్బుకి బలి అయ్యే పశువుల్ని వెతుక్కుంటూ కసాయిజనం రూపాయి కత్తులు దూసి వస్తూంటారు. అక్కడ కొత్తజీవి అడుగుపెట్టిందా - దాన్ని కత్తికో ముక్కగా కోసుకు తింటారు. లోకం తన మలినాన్ని కడుక్కొని - విసర్జించిన మురుగు నీరు, నిలువవుండే గుంట ఆ వాడ.

ముత్యాలి రక్షణ, ప్రల్లదనం హెచ్చుగావున్న తుంటరి జట్కాలోలే సోములు తనమీద వేసుకున్నాడు. వాడంటే చాలామందికి భయం. తాగి వున్నాడంటే ఏమైనా చెయ్యగల కొట్లాటలు తిరిగినవాడు. పొగరుబోతు. ముత్యాలి దగ్గరకుపోవాలంటే కొంచెం వళ్ళు దగ్గర వుంచుకోవాలి. లేకపోతే అంగబలం వుండితీరాలి. అందుకే ముత్యాలు సరిలి వుమ్మేసిన చెరుకు పిప్పిలా కాలేదు.

ముత్యాలు ముప్పైదాటిన ప్రౌఢ. తెంపరితనంలేనిది. మాటకారి కాకపోయినా కొంత నోరుగలదే.

ముత్యాలు బాగా సంపాదిస్తుంది. సోములు పెట్టినంత పెడతాడు. మిగతాది పైసంపాదనే. ముత్యాలు చూడని సినిమా వుండదు. దగ్గు, తుమ్ము లేకుండా, కాంపౌండరు వెంకటేశ్వర్లు చేతిలో పడకుండా కాలక్షేపం చేస్తోంది.

అందుకనే ముత్యాలంటే మిగతా వాళ్ళకి కడుపుమంట.


ముత్యాలికి కడుపు వచ్చింది. ఆ వాడ వాడంతా, వారకాంతలందరూ యింతో అంతో సంతోషించారు.

ముత్యాలకి సోములు తెచ్చిన బెడదని అనుమానం. "దీనితో తన సంపాదనపడిపోగలదు. దీనికి వేరేవుపాయం ఏముంది?" అనుకుంది ముత్యాలు. కడుపు తీయించుకుంటేనో! ఆ మాట తలుచుకుంటేనే ఒళ్ళంతా వణుకు పుట్టింది. "అంతకుముందు వెంకటేశ్వర్లు యిచ్చినమందు మింగి, కడుపుతో వున్న సింహాచలం ఏమైంది?"

నాగితో ఆలోచించింది ముత్యాలు. నాగి తాగి బండబూతులు వాగినా ఎప్పుడప్పుడు మంచి సలహా యిచ్చి సాయం చేస్తుంది. నాగి "మరేం ఫరవాలేదు" పొమ్మంది. తల్లివి కమ్మని ముత్యాలికి సలహా యిచ్చింది.

నాగిపేరు చెపితే అక్కడజేరే పోకిరీ వెధవలందరికీ హడలు. తొడలు చరుచుకొంటూ రెచ్చకెక్కిందంటే ఆ ఊళ్ళోవున్న సగంమంది బ్రతుకు బయటపడిందన్నమాటే. దానినోట్లో నోరుపెట్టి ఎవరూ గెలవలేదు. రోజులో సగభాగం తాగే వుంటుంది. ముత్యాలు ఎప్పుడోగాని తాగదు. తాగితే వెంకన్న తెచ్చిన తీపికల్లు తాగుతుంది.

ఏదైతేనేం ముత్యాలకి కడుపు వచ్చింది. ఆ మాట అలజడి రేకెత్తించింది, దాని ఖాతాదారులందరికీ అదో



పెద్ద చిక్కే తెచ్చి పెట్టింది. సోములు మాత్రం తన్ను పట్టిసట్టే ఉన్నాడు.

కాలం గడచిన కొద్దీ ముత్యాలు [illegible]ని మాలపించింది. రిండి కూడా

మొహం వాచిపోయింది. డబ్బులుంటం లేదు. సోములు పారేసే అర్ధా పావలాతో ఏం తింటుంది? వాడేం కట్టుకున్న మొగుడా? ముత్యాలి ముఖం చూసేవాడే లేడు. వొళ్ళమ్ముకుంటేనే గాని గడవని బ్రతుకాయెను!

అయాచితంగా తనలో ప్రవేశించిన జీవుణ్ణి తిట్టుకుంది. ఒంటో ఓపిక తగ్గింది. ఆయాసం పెరిగిపోయింది. శరీరం శుష్కించి కడుపు బరువై. దవడలు వ్రేలాడుతున్నాయి. డబ్బులిచ్చినవాడినల్లా సంతోషపెట్టడానికుపకరించే చనుగవ పల్లు తప్పి గుండెలమీదికి జారింది.

వెయ్యాల చూలాయెను! ముద్దా, ముచ్చటా, సంతోషమూ, చట్టుబండలా?

ఎవరి ఆనందం కోసం తన గర్భస్థమైందీ జీవని విచారించింది ముత్యాలు.

లోపల కదలాడే ప్రాణిమీద విపరీతమైన అసహ్యత, తన నోటిదగ్గర తిండి పడగొట్టిందే అనే కోపం ప్రబలాయి. కాని ఎంత కాదన్నా కడుపున కాసే కాయామెను. ఏదో తెలియని పేగు సంబంధం పీకేది. ప్రాణంలో ప్రాణమనీ జాలి కలిగేది.

ఎవరో ఒకళ్ళు యింత తినడానికి పడేస్తున్నారు. పగలస్తమానం తోటి వాళ్ళతో ఏదోఒక సోదితో పోతోంది. వాళ్ళు కూడా లోపలున్న బిడ్డనే ఆడిపోసుకుంటున్నారు. అందులో బిడ్డ తల్లులైనవాళ్ళు ఒకరిద్దరున్నారు. కాని ఆ వాడలో అడుగు పెట్టాక ఒక్కతె కూడా నీళ్ళాడలేదు. నీళ్ళాడితే డొక్కాడదనీ రోగిష్టో కరక్కాయేననీ వాళ్ళకి బాగా తెలుసు. అందరికీ ఒళ్ళంతా రోగాలే. రోగబలమో, కంపౌండరు వెంకటేశ్వర్లు యిచ్చిన మందుబలమో గాని ఒక్క మోడైనా చిగర్చలేదు. ఆ నరకంలోకి నిర్భాగ్యుల్ని మరి తేలేదు.


ఒక రోజునాడు పాత సంబంధం మర్చిపోలేక ముత్యాల్ని పలకరించి పోయాడు. పోతూ పోతూ ఓ రూపాయి చేతిలో పడేసి పోయాడు. వాడి ముద్దింకా తీరలేదు. "ఇంకా ఎన్ని నెలలు" అన్నాడు. "ఇంకెంత మావాఁ రెండు మూడు నెలల్లే!" అంది ముత్యాలు.

ముత్యాలు సరసాలాడుతూ ఎవడితోనో కనపడగానే సోములికి కోపం పెరిగిపోయింది. తాగిన మైకంలో సొంత పెళ్ళాన్ని గదమాయించినట్టు గదమాయించాడు ముత్యాల్ని.

సోములు డబ్బు యివ్వటంలేదనీ, తన మూలపడగానే చూడటం లేదనీ ముత్యాలు సమాధానం గట్టిగానే చెప్పింది.

సోములు వొళ్ళు వాచేలా కొట్టాడు.

ఆ మార్నాడు బ్రతిమాలాడు. ముత్యాలికిదంతా నచ్చలేదు, అనలీ




వృత్తిమీదే విసుగుపుట్టింది. ముత్యాలు మొదటిసారిగా బయట ప్రపంచాన్ని గురించి ఆలోచించింది. వేరే విధంగా బ్రతకడాన్ని గురించి ఆలోచించింది.

అప్పేళ పగలు రిక్షా వీరాస్వామితో పనికోసం ఊరినపడింది ముత్యాలు. ఏ అమ్మో తిండీ, పాతాపెట్టి నెలకు నాలుగు రూపాయలిచ్చి చాకిరికి పెట్టుకుంది ముత్యాల్ని.

నాలుగు రోజులు చేసేటప్పటికి ముత్యాలికి పనిలో సులువు తెలిసింది లేదు. ముత్యాలు పగలు పని చేస్తోంది. రాత్రిళ్ళు నిద్రపోతోంది. ఇది చాలా పెద్ద మార్పు. ఇదివరకటి పద్ధంతా రాత్రి, నిద్రమాత్రం పగలు. ఈ బ్రతుకులో ముత్యాలికి కొంత సుఖం ఉందనిపించింది. పగలల్లా గొడ్డు చాకిరీ చేసినా రాత్రి కన్ను మూస్తే హాయిగా నిద్రపడుతోంది.

ముత్యాలి ధోరణి సోములికి బాగో లేదు. అయినా దాని బ్రతుకది బ్రతుకుతోంది పొమ్మనుకున్నాడు - అలాగే ఈ నాలుగు నాళ్ళు బ్రతకనీమనుకున్నాడు సోములు.

తను కనబోయే బిడ్డమీద ముత్యాలికి క్రొత్తగా ప్రేమ కలిగింది. తినేటప్పుడు తను తింటూన్నట్టు కాకుండా పొట్టలో ఉండి యాంపసపడే బిడ్డకి పెడుతూన్నట్టు తోచేది. అందులో ఏదో సంతృప్తి!

మొదట్లో ఏదో వద్దనుకున్నా పిల్ల

లంటే తెలీని మక్కువ ఏర్పడింది. సృష్టి తన పరిరక్షణకోసం - ఏర్ప రచుకున్న కవచం లాంటిది తల్లి ప్రేమ.

ముత్యాలికి నెలలు నిండాయి. ఇల్లు కదల్లేక పోయింది. కాంపౌండరు వెంకటేశ్వర్లు ఎరుకల వెంకమ్మ చూస్తున్నారు. వెన్ను ముదిరినకాన్పు. తల్లికి వంటో పట్టులేదు. ఏలా గో గండం గడచి పిండం బయట పడింది.

ముత్యాలి కొడుకు గట్టిగా నాలుగు పౌన్లు కూడా ఉండడు. నాగి సాయం చేసింది పురిటికి. పని చేయించుకున్న యిల్లాలు పిడికెడు పాతబియ్యం, పాత కోక వీరాస్వామి చేతికిచ్చి పంపింది. ఆనెల నాలుగు రూపాయలూ కాంపౌం డరు మింగేసాడు.

సోములు జబ్బుపడి బాగా తీసి పోయాడు. కదలడం మానుకున్నాడు. ముత్యాలు ఓ పదిరోజుల్లో కొంత కోలుకుంది. జ్వరం కాయలేను వచ్చే రోగాలుకూడా దాని పరిస్థితికి హడలి పారిపోయాయి కామోసు!

ముత్యాలు తన పంటిని కరచిపెట్టు కుని, పాలు తాగేందుకు ప్రయత్నించే కసిగందును చూసి మురిసిపోయింది. దానిలో ఏ మూలో దాగిఉన్న మాతృ త్వం కట్టలు త్రెంచుకుని ప్రవహిం చింది.

"ఈడు సూడవే నాగి! బుగ్గమీద సొట్టా ఆడూను." తన సంతోషాన్ని నాగితో పంచుకో జూసింది ముత్యాలు.

"ఏడిరాడు ఎదపసన్నాసి — నీ కడుపుమీద దెబ్బ కొట్టాడు." అంది నాగి విసుక్కుంటూ.

ముత్యాలు కాళ్ళు వచ్చి ఆరాక, ఆ వాడ వదిలిపోదామనుకొంది. అక్క డుంటే కాకులు పొడుచుకు తిన్నట్టు తింటాయి అలవాటుపడిన రాబం దులు.

ఆవేళ ఊళ్ళో ఏదో పండుగ హడా వుడి. ఎక్కడివాళ్ళు అక్కడ జేస్తు న్నారు. పగలల్లా తిరునాళ సాగింది. జీళ్ళ దుకాణాల దగ్గరున్నంది, రంగుల రాట్నంపరకూ వచ్చాయి. సినిమాల కోసంకూడా జనం ఎగబడ్డారు.

రాత్రి పదేసరికి వానజల్లు పడటం ప్రారంభమైంది. ముత్యాలున్నవాడలో ఎవ్వరికీ తీరిక లేదు. అంతా సంపా దనలో మునిగిపోయారు. ముత్యాలు మాత్రం నులక మంచంమీద పడుకొని కునుకు తీస్తోంది. ముత్యాలి కొడుకు నోట్లో వేలేసుకొని మగతగా చీకు తున్నాడు.

ముత్యాలి పూరిపాకలోకి తలుపు తోసుకొని ప్రవేశించాడు — ఓ పాత ఖాతాదారుడు. వాడి వెనగ్గా మరోడు చేరాడు. ఒంకరిగా పలకరింపు లయ్యాక - దీపపువత్తి ఎగసన తోసాడు.